క్లుప్తంగా

డీఎస్సీ-2024 టీచర్ల వార్షికోత్సవ సంబురాలు



జనగామ: నర్మెట మండలంలో డీఎస్సీ–2024 ద్వారా గత ఏడాది కొత్తగా నియమితులైన 16 మంది ఉపాధ్యాయులు బుధవారం వార్షికోత్సవ సంబురాలు జరుపుకున్నారు. ఎంఈఓ ఎం.ఐలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాలల్లో కొత్త టీచర్లతో కొరత తీరడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. రాబోయే కాలంలో మరింత మెరుగ్గా టీచర్లు పనిచేసి అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

రజకులకు రుణాలు ఇవ్వాలి

పాలకుర్తి: రజక వృత్తిదారులకు రూ.10 లక్షల రుణం ఇవ్వాలని రజక సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం గూడూరు గ్రామంలో నిర్వహించిన రజక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రతీ గ్రామంలో రజక జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి పింఛన్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



బచ్చన్నపేట: జగన్ అభిమాని బొడ్డు ప్రవీణ్‌కుమార్ ఏపీలోని ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద పూలమాల వేసి బుధవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని 100 ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజల అనంతరం తాడేపల్లిగూడెంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఆలయాల ప్రతిమలను అందజేస్తానని చెప్పారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



పాలకుర్తి టౌన్: నియోజకవర్గంలో గిరిజన తండాలకు, మారుమూల అవాస ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 30 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినందుకు బుధవారం రాజీవ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. చాకలి ఐలమ్మ మార్కెట్ చైర్‌పర్సన్ లావుడ్య మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

దుమ్ముతో పరేషాన్

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, దుకాణాదారులు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా మీదుగా వాహనాలు వెళ్లినప్పుడు విపరీతమైన దుమ్ము లేచి ప్రజలకు ఊపిరి ఆడనీయడం లేదు. ప్రధాన చౌరస్తా గుండా చేర్యాల, ఆలేరు, జనగామ మూడు పట్టణాలకు వెళ్లే దారులు ఉన్నాయి. ప్రతి నిత్యం ఈ చౌరస్తా మీదుగా వందల వాహనాలు పలు పట్టణాలకు వెళ్తుంటాయి. అలాగే పలువురు ప్రయాణికులు కూడా పాత బస్టాండ్ నుంచి గ్రామ పంచాయతీ వరకు కాలినడకన వెళ్తుంటారు. ఇక్కడ వెలువడే దుమ్ము వారి కళ్లలో పడుతుండటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పక్కనే ఉన్న హోటళ్లలోని తినుబండారాలు, ఆహార పదార్థాలపై దుమ్ము పడటంతో అవి తిన్న వారితో పాటు వ్యాపారుల ఆరోగ్యం దెబ్బతింటోంది. దీంతో వారు ఆస్పత్రులకు వెళ్లి వేలల్లో డబ్బులు ఖర్చు చేస్తున్నారు. అలాగే బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు కూడా దుమ్ముతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై దుమ్ము లేవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.


వాహనాలు వెళ్తుండడంతో లేస్తున్న దుమ్ము

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నర్మెట: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సునీతాదేవి అన్నారు. బొమ్మకూర్ సెక్టార్‌లోని వెల్దండ ఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ మాసంలో తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన ఆహారాన్ని పొందవచ్చని అన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు కుంటి రాంబాయి, మమత, మంజుల, విజయ్‌కుమారి, లీలా, నాగమ్మ, ఉమా, నాగమణి పాల్గొన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: కౌమార దశ బాలికల నుంచి పుట్టిన ప్రతి శిశువు అభ్యున్నతి కోసం పాటుపడుతున్న అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వడ్లకొండ సావిత్రి సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసనం, పౌష్టికాహారంపై అవగాహన, కడవెండిలో కౌమర దశ బాలికలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయిని పద్మ, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, రహిమత్‌బీ, సులోచన, పద్మ, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.


నర్మెట: పోషణ మాసోత్సవంలో అంగన్‌వాడీలు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

పాలకుర్తి/కొడకండ్ల/దేవరుప్పుల: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లోని పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం కోసమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దళారులను ఆశ్రయించుకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకొని గిట్టుబాటు ధరను పొందాలని రైతులకు సూచించారు. ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద తూకాలు, తేమ శాతం కొలిచే పరికరాలు సక్రమంగా పనిచేయాలని, కనీస వసతులు, చెల్లింపులు సమయానికి జరిగేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, తీగారం గ్రామంలో రైతులు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి నాగలి బహూకరించి సన్మానించారు.


పాలకుర్తి: ఎల్లరాయని తొర్రూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తదితరులు

ఆయా కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ వసంత, డీపీఎం, ఏపీఎంలు నర్సయ్యగౌడ్, గుడెల్లి సత్యనారాయణ, తహసీల్దార్లు చంద్రమోహన్, ఆండాళ్, ఎంపీడీఓ సురేష్‌కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్లు ఈరంటి సాయికృష్ణ, మంజుల భాస్కర్, డైరెక్టర్లు నాగరాజు, విజయ డెయిరీ జిల్లా చైర్మన్ కాసారపు ధర్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, చిట్యాల ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్మన్ మంజుల భాస్కర్, గిరగాని కుమారస్వామి పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీధర్‌రావు

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి/జఫర్‌గఢ్: జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల వైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీధర్‌రావు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో, రఘునాథపల్లి మండల కేంద్రంతోపాటు కోమళ్ల గ్రామంలో, జఫర్‌గఢ్ మండలంలోని రఘునాథ్‌పల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన హాజరైన ఆయన మాట్లాడారు. పాడిరైతులు పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని, నాలుగు నెలల వయస్సు దాటిన దూడలకు, పెద్ద పశువులకు, చూడి పశువులకు ఆరు నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ దేవేందర్, మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ చక్రధర్, పశు వైద్యులు శ్రీనాథ్, మౌనిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మురళీధర్‌రావు

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

చిల్పూరు: పాడి రైతులు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసే శిబిరాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి మూడిక అనేష్ కోరారు. మండలంలోని మల్కాపూర్ పశు వైద్యశాలలో పశువులకు గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది ఫయాజ్, నాగరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.


చిల్పూరు: పశువుకు టీకా వేస్తున్న అనేష్

టీకాలు తప్పనిసరి

పాలకుర్తి టౌన్: పశువులకు గాలికుంటు టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి డి.అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పశువైద్యశిబిరంలో 365 పశువులకు టీకాలు వేసిన సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. గోపాలమిత్ర సిబ్బంది ఉప్పలయ్య, ఓఎస్ పశుమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

సంఘాల రుణాల ప్రక్రియను వేగవంతం చేయండి

- డీఆర్‌డీఓ వసంత

దేవరుప్పుల: స్వయం సహాయక మహిళా సంఘాల పురోగతి కోసం రుణాల ప్రక్రియను వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ వసంత సూచించారు. బుధవారం మండలంలోని చందన మండల సమాఖ్య కార్యాలయంలో ఐకేపీ ఏపీఎం సత్యనారాయణ అధ్యక్షతన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల బకాయి వసూళ్లు, కొత్త రుణాల చెల్లింపులపై సమీక్ష చేశారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించే దిశలో ఉత్పత్తి రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ రుణాలు ఇచ్చేందుకు ఐకెపి సిబ్బంది తోడ్పాటు అందించాలన్నారు. ఎంపీడీఓ తాటి సురేష్‌కుమార్, సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మమత, ఐకెపి సీసీలు సోమనారాయణ, జి వసంత, ఉమ, రఘు, సుదర్శనమ్ పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న వసంత

నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాలి


ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏఈ ఈశ్వర్

తరిగొప్పుల: ప్రభుత్వ నిబంధనలు మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని హౌజింగ్ ఏఈ ఈశ్వర్ అన్నారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన బుధవారం పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణం వ్యయం అధికం కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కారోబార్ సాంబారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ విద్యా దినోత్సవం

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ప్రపంచ విద్యార్థి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు అబ్దుల్ కలాం జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

పాలకుర్తి టౌన్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఇన్‌చార్జి హెచ్‌ఎం ఓరిగంటి రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అబ్దుల్‌కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


కలాం జీవిత చరిత్ర పుస్తకాలతో విద్యార్థులు

న్యాయం కావాలని వివాహిత నిరసన

- తన భర్త మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆరోపణ

తరిగొప్పుల: తాను ఉండగా తన భర్త మరొక మహిళను వివాహం చేసుకొని తనను, తన కుమారుడిని పట్టించుకోవడంలేదని ఓ వివాహిత తన చిన్న కుమారుడితో సహా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. ఈ ఘటన తరిగొప్పుల మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బాధిత మహిళ జోడుముంతల సుమలత మాట్లాడుతూ.. జనగామ జిల్లాలోని చిల్పూర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన జోడుముంతల సత్యనారాయణతో 2001లో తనకు వివాహం జరిగిందని, ఇద్దరు కుమారులు జన్మించారని తెలిపింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో 2016లో హన్మకొండలోని తల్లిగారింటికి వెళ్లి చిన్నకుమారుడితో అక్కడే ఉంటున్నానని పేర్కొంది. తన భర్త 5 సంవత్సరాలుగా మరో మహిళతో సహజీవనం చేస్తూ పెద్ద కుమారుడిని తన నుంచి వేరు చేసి, తనను, తన చిన్న కుమారుడిని పట్టించుకోవడంలేదని వాపోయింది. తన భర్త తరిగొప్పుల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్నాడని తెలిసి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తనకు న్యాయం చేయాలని కార్యాలయం ఎదుట నిరసన తెలిపానన్నారు. ఇట్టి విషయమై సత్యనారాయణను వివరణ కోరగా.. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో తానే నాతో సంసారం చేయలేనని చెప్పి చిన్న కుమారుడితో వెళ్లిపోయిందని చెప్పాడు. అప్పటినుంచి తాను వేరుగా ఉంటున్నానని తెలిపాడు.


న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సుమలత

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: జిల్లాలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16, 17 తేదీల్లో అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట చేపట్టనున్న ధర్నాలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పత్తినే నమ్ముకుని వ్యవసాయం సాగిస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా పత్తికి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు రూ.10,075 మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు రాయపురం భిక్షపతి, నక్క యాకయ్య, వేల్పుల పెద్ద రాములు, అజయ్, సకినాల కొమురయ్య, శాగ యాదగిరి, నీరటి కొంరయ్య, ఎండీ శంషోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంపై వివక్ష తగదు


మహాగర్జన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏసుపాదం

దేవరుప్పుల: అసంఘటిత కార్మికుల సంక్షేమంపై పాలకవర్గాల వివక్ష తగదని తెలంగాణ కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ పడమటింటి ఏసుపాదం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నవంబర్ 27న ఇందిరా పార్కు వద్ద కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తలపెట్టిన మహాగర్జనను కరపత్రాలను ఆవిష్కరించి ప్రచారం ప్రారంభించారు. టీకేఎస్ వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అల్వాల వెంకన్న, మాజీ సర్పంచ్ చింత యాదగిరి, భాషిపాక ఐలయ్య పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కురిసిన వర్షానికి ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. అలాగే కోతకు వచ్చిన వరి పంటను కోయకుండా వర్షాలు అడ్డుపడుతున్నాయి. కట్కూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి కొట్టుకుపోయింది. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని అన్నదాతలు కోరుతున్నారు.



కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్పచేస్తున్న రైతు

సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలి



తరిగొప్పుల: మండలంలోని అంకుషాపూర్ సర్పంచ్ స్థానానికి జనరల్ మహిళా కాకుండా ఎస్సీలకు కేటాయించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన దళితులు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఆర్డీఓ, ఎస్సీ, ఎస్టీ జిల్లా అధికారిని బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. 67 ఏళ్లుగా బీసీ, ఎస్టీ, ఓసీ తప్ప ఎస్సీలకు రిజర్వేషన్ కేటాయించలేదని వివరించారు. కార్యక్రమంలో అబ్బి భిక్షపతి, పంగ నాగభూషణం, పంగ కిరణ్, సుధాకర్, నరేష్, పైస బాబు, వెంకటేష్, సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలుకింద పడి యువకుడి మృతి


యువకుడి మృతదేహం

జనగామ: మండలంలోని పెంబర్తి రైల్వేస్టేషన్ సమీపం పటేల్‌గూడెం క్రాసింగ్ సమీపంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుభాష్‌నగర్ సూదిమందు ఇల్లందుకు చెందిన ఫొటోగ్రాఫర్ కట్కోజుల కళ్యాణ్ కుమార్(20) సికింద్రాబాద్ వైపు వెళ్లే రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఉపేందర్, కానిస్టేబుల్ నరేష్ యాదవ్, ఎస్సై కిష్టయ్య సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

నివాళి

లింగాలఘణపురం: రామచంద్రగూడెం పాల కేంద్రం చైర్మన్, రైతు కొత్త సుధాకర్‌రెడ్డి (65) మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా, బుధవారం జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

సంక్షిప్త సమాచారం


నియామకం

దేవరుప్పుల: మండలంలోని నీర్మాల గ్రామ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా కొత్త దయాకర్‌రెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ తెలిపారు. ఇటీవల ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు చింతల రవీందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరడంతో ఆయన స్థానంలో పార్టీ గ్రామ కార్యకలాపాలకు కొత్త ఇన్‌చార్జ్ నియమింపబడ్డారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ బలోపేతం కోసం పాటుపడుతానని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చిల్పూరు: గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఎంపీడీఓ బర్మావత్ శంకర్ నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు చేయించాలన్నారు. ఎంపీఓ మధుసూదన్, ఈజీఎస్ ఇంజనీర్ సింగపురం కిరణ్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సన్మానం



దేవరుప్పుల: ఓ మారుమూల గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యాభివృద్ధికి పాటుపడిన ప్రదాతలు గొరిగె నర్సింహ, చిందం భాస్కర్ కురుమలను పాఠశాల యాజమాన్యం బుధవారం ఘనంగా సన్మానించింది. మండలంలోని గొల్లపల్లికి ఓ కార్యక్రమానికి వచ్చిన వారిద్దరు ప్రభుత్వ పాఠశాల దుస్థితిని చూసి రూ.25 వేలతో పాఠశాల గోడలకు రంగులు వేసి ప్రాథమిక విద్యార్థులు అభ్యసించేలా పలు అక్షరమాల చిత్రాలను వేయించారు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు ఖాజా, గ్రామీణ వైద్యులు తీగల సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

బచ్చన్నపేట: అన్నదాతలు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జీవామృతం లాంటి ఎరువులను ఇంటి వద్ద తయారు చేసుకుని వాడితే మంచి ఫలితాలు ఉంటున్నాయని అన్నారు. వరి పంటనే కాకుండా పప్పు దినుసులను కూడా సాగు చేసుకోవాలని సూచించారు. ఏఈఓలు, రైతులు ఉన్నారు.

విద్యుత్ మరమ్మతు పనులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో ఏఈ శివకుమార్ ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది బుధవారం మరమ్మత్తు పనులు చేపట్టారు. శివునిపల్లిలోని పాత ఆరవవార్డులో ఉన్న విద్యుత్ లూజ్ లైన్లు, వదులుగా ఉన్న పోల్‌లను సరిచేయడం, విద్యుత్ లైన్లపైకి వచ్చిన చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనులను చేపట్టారు. లైన్ ఇన్‌స్పెక్టర్ సాంటిరెడ్డి పెద్దిరెడ్డి, లైన్‌మన్ గబ్బెట సుధాకర్ పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది పనులు చేపట్టారు. ఏఎల్‌ఎంలు వెంకటేష్, రాము, కట్టర్ దాస్ సురేష్, కాలనీవాసులు రావుల ఏడుకొండలు పాల్గొన్నారు.

టీచర్లు తనిఖీలు చేస్తే.. పాఠాలు చెప్పేదెవరు

పాలకుర్తి టౌన్: ఉపాధ్యాయులకు పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత అప్పగించే ఉత్తర్వులు వెంటనే నిలిపివేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పనితీరును పర్యవేక్షించడానికి ఎస్జీటీ, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించి బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ చేశారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకోం..

బచ్చన్నపేట: నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిషలు పాటుపడే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోబోమని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గందమల్ల నరేందర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పూటకో పార్టీ మార్చే నాయకులు సైతం అనవసరమైన విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేను విమర్శించిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాసపేట రవీందర్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని అన్నారు. నాయకులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

జనగామ రూరల్: యశ్వంతపూర్ వాగు, వడ్లకొండ శివారులోని వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారంతో బుధవారం మధ్యాహ్నం సీఐ సత్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సైలు రాజన్ బాబు, సాంబరెడ్డి సిబ్బందులతో వెళ్లి 14 ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లపై, యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొబ్బరిచెట్టుపై పడిన పిడుగు

దేవరుప్పుల: గొల్లపల్లిలో ఓ ఇంట్లోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో పెను ప్రమాదం తప్పింది. బుధవారం సాయంత్రం గ్రామంలోని కోనేటి సోమయ్య ఇంట్లోని కొబ్బరి చెట్టు కొన మధ్యలో పిడుగుపడడంతో మంటలు లేవడంతో ఆ ఇంటివాసులు తీవ్ర ఆందోళన చెందారు. కొద్దిసేపటికి ఉరుములు తగ్గడంతో పరిసరాల వాసులు సైతం ఊపిరి పీల్చుకున్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

కొడకండ్ల: ఆకస్మిక గుండెపోటు మరణాలను నివారించేందు కోసం దోహదపడే సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి హరికృష్ణ కోరారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర, మండల పరిషత్ కార్యాలయం, టీఎస్ఆర్‌జేసీ కళాశాలలో సీపీఆర్‌పై ఆయన అవగాహన కల్పించారు. ఆకస్మిక గుండెపోటుకు గురైన సందర్భంలో సీపీఆర్ ద్వారా గుండెకు రక్తప్రసరణ, నోటి ద్వారా ఆక్సిజన్‌ను అందించడం ద్వారా బాధితులను రక్షించే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనర్సింహ్మారావు, ఎంపీడీఓ నాగేశ్వరావుపాసూరి, ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: పట్టణంలోని ఏసిరెడ్డినగర్ డబుల్ బెడ్రూం కాలనీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మౌలిక వసతులు కల్పించాలి సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం పట్టణ అధ్యక్షుడు జోగు ప్రకాశ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అహల్య, బూడిది గోపి, విజేందర్, బిట్ల గణేశ్, గంగాపురం మహేందర్, ప్రశాంత్, పల్లెర్ల లలిత, పందిళ్ల కళ్యాణి, భిక్షపతి అశోక్ పాల్గొన్నారు.

